క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగే గ్రామాలకు గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దేవోజీనాయక్ బుధవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన



మార్కెట్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నందికొండ మున్సిపల్ కమిషనర్

నాగార్జునసాగర్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన నందికొండ మున్సిపల్ కమిషనర్ శ్రీను వివిధ కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించారు. హిల్‌కాలనీలో సుమారుగా రూ.2కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు, జలాశయ తీరంలో రూ.2కోట్లతో నిర్మించనున్న మోడ్రన్ దోభిఘాట్ పనుల ప్రారంభానికి వేసిన శిలాఫలకం, పైలాన్, వైకుంఠ ధామం, పైలాన్ కాలనీకి మంజూరైన రోడ్డు, హిల్‌కాలనీ బస్టాండ్ తదితర పనులను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజనీర్‌తోపాటు సిబ్బంది ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

మిర్యాలగూడ: మిర్యాలగూడ మండల పరిధిలోని తుంగపాడు ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 22వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దీన సుజాత బుధవారం తెలిపారు. 7- 10వ తరగతిలో మిగిలి ఉన్న సీట్ల కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆలగడపలో ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామంలో బుధవారం వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్స్ సిస్టమ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మోహిద్ పలువురికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ స్వరూపరాణి, ఎఎన్ఎం శాంతి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్లు సైదాబి, మణెమ్మ, అరుణ, ఆశావర్కర్లు రుక్మిణి, అరుణ, వైఆర్‌జీ కేర్ సంస్థ డీఆర్‌పీ భిక్షమయ్య, సూపర్‌వైజర్ సుజాత, దివ్యవాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న నర్సింహారెడ్డి

దేవరకొండ: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్య సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండ మండల పరిధిలోని పద్మట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన పీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ చలం పాండురంగారావు, పల్లా దేవేందర్‌రెడ్డి, వలమల్ల ఆంజనేయులు, ఝాన్సీరాణి, పల్లా రంగా రెడ్డి, జంగయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

నిడమనూరు: మండలంలోని ముప్పారం గ్రామంలో బండారు నాగమ్మ(70) మృతి చెందగా బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి కుటుంబసభ్యులు, అంత్యక్రియలకు వచ్చిన వారికి బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరు మృతి చెందినా.. తమకు సమాచారం అందిస్తే అంత్యక్రియల అనంతరం అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు.

హైవేపై గుంతలు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజీనగర్ వద్ద జడ్చర్ల - కోదాడ హైవేపై గుంతలు ఏర్పాడ్డాయి. కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టడం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. ఈ విషయమై హైవే ఏఈ లింగయ్యగౌడ్‌ను స్పందిస్తూ రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బాపూజీనగర్ వద్ద హైవేపై ఏర్పడిన గుంతలు

పూడ్చకుండా వదిలేశారు..

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలో తడకమళ్ల బైపాస్ రోడ్డు నుంచి రాజీవ్‌చౌక్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టిన సమయంలో రాజీవ్‌చౌక్ వద్ద నీటి అవసరాలకు మున్సిపల్ అధికారులు రోడ్డుపై బోరు వేయించారు. అనంతరం వాహనాలకు ఇబ్బందిగా ఉండటంతో మోటారును తొలగించారు. కానీ బోరు గుంతను పూడ్చలేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ చౌరస్తాలో నోరు తెరుచుకొని ఉన్న బోరు పైపును మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి దీనిని పూడ్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



రాజీవ్‌చౌక్ వద్ద పూడ్చకుండా వదిలేసిన బోరు గుంత

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంతో పాటు చిల్కమర్రి, బాలాజీనగర్, అంగడిపేట, దుగ్యాల, మేడారం, పడమటితండా, వద్దిపట్ల, భీమనపల్లి, కేశంనేనిపల్లి, గుడిపల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజవర్గంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, జెడ్పీటీసీ అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి, వైస్ ఎంపీపీ అర్వపల్లి సరితానర్సింహ, ఎంపీటీసీలు మధుసూదన్‌రెడ్డి, నక్క రాములు, కళమ్మకర్ణయ్య, రమావత్ మంగ్లీ, పీఏసీఎస్ చైర్మన్ మణిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కుక్కల గోవర్ధన్‌రెడ్డి, బోడ్యానాయక్, సతీష్‌రెడ్డి, ధర్మారెడ్డి, కొర్ర రాంసింగ్, హరికృష్ణ, పల్లె సత్యనారాయణ, విజయలక్ష్మి, ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

25న సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు



హాలియాలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బంజారా సేవా సంఘం నాయకులు

హాలియా: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 25న నాగార్జునసాగర్‌లో నిర్వహించనున్న శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాణావత్ బాబురావు నాయక్ కోరారు. బుధవారం హాలియా పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో సంత్ సేవాలాల్ జయంతి వేడుకల కరపత్రాలను బంజారా సేవా సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నాగార్జునసాగర్‌లోని హిల్ కాలనీ అయ్యప్ప గుడి పక్కనే ఉన్న శ్రీ సేవాలాల్ మహారాజ్ ప్రాంగణంలో ఈనెల 25న సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని గిరిజన సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, మహిళా నాయకులు, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంగోతు భగవాన్‌నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, ప్రధాన కార్యదర్శి రమావత్ రవినాయక్, కోశాధికారి సక్రూనాయక్, సపావట్ పాండు నాయక్, మేరావత్ ముని నాయక్, సర్దార్‌నాయక్, శంకర్ నాయక్, నాగేందర్ నాయక్, ప్రసాద్ నాయక్, పాండునాయక్, నాగేశ్వరరావు నాయక్, నరేష్ నాయక్, దత్తు నాయక్, మంగ్తానాయక్, బుర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీలో ఈనెల 25న నిర్వహించనున్న సంత్‌సేవాలాల్ జయంతిని జయప్రదం చేయాలని తెలంగాణ సోషల్‌మీడియా కన్వీనర్ చందూలాల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలోని గిరిజన నాయకులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ యోజన పథకాన్ని చేతి వృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ చాంబర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం మిర్యాలగూడ మునిసిపాలిటీకి రెండు వేల దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తే 2500 దరఖాస్తులు వచ్చాయన్నారు. అన్నింటినీ పరిశీలించిన అనంతరం 1800 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పొందుపరిచామని తెలిపారు. ఈ పథకానికి చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారని, ఎంపికైనా లబ్ధిదారులకు వారం రోజుల పాటు ప్రత్యేకంగా శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ సందర్భంగా రూ.500 చెల్లిస్తారని, శిక్షణ అనంతరం రూ.15 వేల విలువ గల టూల్ కిట్టు అందజేస్తారని చెప్పారు. మొదటి విడతలో రూ.లక్ష ఇస్తారని, ఈ డబ్బులు చెల్లిస్తే మరో రూ.2లక్షల వరకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 5శాతం వడ్డీతో రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మెప్మా సీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్య రానీయొద్దు

మిర్యాలగూడ: గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ శేషగిరిశర్మ అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు సంరక్షించాలన్నారు. నర్సరీల్లో ఉపయోగకరమైన మొక్కలు పెంచాలన్నారు. ఎండిపోయిన మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేయించి, డీసీఆర్ చేసి వాటి ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. జనన, మరణ రిజిస్టర్లను తప్పకుండా రాయాలని చెప్పారు. సమావేశంలో ఎంపీఓ వీరారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

దోమలను నివారించాలి

మాడుగులపల్లి : దోమల నివారించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) దుర్గయ్య సూచించారు. మండలంలోని ఇందుగుల గ్రామంలో జ్వర పీడితులు అధికంగా ఉండడంతో బుధవారం వైద్యారోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఇళ్లలోని నీటి సంపులు, పరిసరాల్లో నీటి గుంతలను పరిశీలించారు. వైద్య సిబ్బంది జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించారు. పలువురికి ఆర్థరైటీస్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. చికున్ గున్యా, డెంగీ, వైరల్ ఫీవర్ లక్షణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు రాజేష్, ఇక్తియార్, ఫిర్దోజ్ ఫర్హండ, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, రామ్మోహన్‌చారి, రాజు, భవాని, సునీత పాల్గొన్నారు.

వైభవంగా హోమం

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలోని మహిషాసురమర్దిని అమ్మవారు, ముత్యాలమ్మ, అంకాలమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు రాంమోహన్‌శర్మ దంపతులు బుధవారం హోమం జరిపించారు. ముందుగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.



హోమం నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు

మాతృభాష పరిరక్షణే ధ్యేయం

మిర్యాలగూడ అర్బన్: మాతృభాష పరిరక్షణే మనందరి ధ్యేయమని మిర్యాలగూడ కేఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షమయ్య అన్నారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ ఈ. రాంరెడ్డి, టి.వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు నర్సింగ్ కోటయ్య, జె.నరేందర్‌రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): తెలుగు భాషా ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటి చెప్పాలని తిరుమలగిరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కొనమంచిలి శ్రీనివాస్ అన్నారు. బుధవారం తిరుమలగిరి మండలంలోని అల్వాల ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతిదేవి, కాళోజీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాపోలు పరమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాపని బాలకృష్ణ, విజయలక్ష్మి, లింగమ్మ, గౌస్‌బాబా, నరేష్‌చారి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు మాతృభాష దోహదం

హాలియా: మానవాళి మనుగడకు మాతృభాష దోహదపడుతుందని చింతగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్బిరెడ్డి వేమారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చింతగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ భావ ప్రసరణ, జ్ఞానార్జనకు మాతృభాషను మించిన సాధనం లేదని, మాతృభాష మాధుర్యాన్ని ముందు తరాలకు అందించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. తెలుగు ఉపాధ్యాయుడు సాగర్ల సత్తయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడ్డం శ్యాంప్రసాద్, ఎండీ పాషా, పురం వెంకటయ్య, పేర్ల వెంకటేశ్వర్లు, ఈగల లింగయ్య, శ్రీనివాస్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ అర్బన్: కేఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న భిక్షమయ్య



తిరుమలగిరి: అల్వాల పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



హాలియా: చింతగూడెంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం వేమారెడ్డి

సమయపాలన పాటించాలి



విద్యార్థుల ప్రతిభను పరీక్షిస్తున్న డీఈఓ

చందంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని డీఈఓ భిక్షపతి పేర్కొన్నారు. బుధవారం చందంపేట మండలంలోని పొగిళ్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, మధ్యాహ్న భోజనం మెనూ పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. ఆయన వెంట ఎంఈఓ సామ్యానాయక్, బాలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

కొండమల్లేపల్లి: మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు సాల్వాది ధనిష్ట సుశీల, కేసాని లింగారెడ్డి, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, నాయకులు దస్రూనాయక్, మేకల శ్రీనివాస్‌యాదవ్, మాడ్గుల యాదయ్య, తుల సీరాం, నెహ్రూ, పాండునాయక్, గురునాయక్, నరేశ్‌గౌడ్, మధుగౌడ్ పాల్గొన్నారు.

టెన్త్ ఇంటర్నల్ మార్కుల రికార్డుల పరిశీలన



శ్రీ సాయి కృష్ణవేణి పాఠశాలలో మార్కుల రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పెద్దఅడిశర్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీసాయి కృష్ణవేణి పాఠశాల, సెయింట్ మేరీ పాఠశాల, వద్దిపట్ల, అజ్మాపురం, జెడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలను బుధవారం మానిటరింగ్ టీం అధికారులు సందర్శించారు. ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మానిటరింగ్ టీం సభ్యులు షరీఫ్, శ్రీనివాస్, కృష్ణ, బాలరాజు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపుతాం

● డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ: మిర్యాలగూడ డివిజన్‌లో అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపుతామని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు బైపాస్ వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో వాటిని అరికట్టేందుకు బుధవారం ఆయా శాఖల అధికారులతో కలిసి సందర్శించి, పలు సూచనలు చేశారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో మాట్లాడారు. గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయి రవాణా కాకుండా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, గంజాయి సరఫరా చేసినా, సేవించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ శివారు, నిర్మానుష్య ప్రాంతాలు, బైపాస్ రోడ్డు వెంట ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. గంజాయి రహిత డివిజన్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసినా, అక్రమంగా రవాణా చేసినా క్రిమినల్ చర్యలు తప్పవన్నారు. ప్రధానంగా నార్కట్‌పల్లి- అద్దంకి బైపాస్ రోడ్డు వెంట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నందిపాడు, రవీంద్రనగర్, చింతపల్లి, ఈదులగూడెం చౌరస్తాల వద్ద వాహనాల వేగాన్ని తగ్గించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతోపాటు రాత్రి వేళల్లో వాహనాలు నెమ్మదిగా వెళ్లే విధంగా స్టిక్కర్లు అంటించనున్నట్లు తెలిపారు. ఆయా జంక్షన్ల వద్ద రబ్బర్ పోల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్, ఎంవీఐ వీరస్వామి, టూటౌన్ సీఐ నాగార్జున, ఆర్అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నందిపాడు జంక్షన్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



మిర్యాలగూడలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్: కేంద్రం వ్యవహరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో బుధవారం మిర్యాలగూడలో రాజీవ్‌చౌక్ నుంచి హనుమాన్‌పేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు వస్కుల మట్టయ్య మాట్లాడుతూ.. మతతత్వ దేశంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో దేశం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వస్కుల సైదమ్మ, కాశీ, మోహన్ నాయక్, కిరణ్, భరత్, వీరన్న, లింగమ్మ, పవన్, శ్రీను, ప్రశాంత్, సతీష్, హరీష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బీసీలకు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలగాని వెంకటేష్ గౌడ్ ఆరోపించారు. బుధవారం మిర్యాలగూడలోని బీసీ సంక్షేమ సంఘం భవనంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు వ్యవసాయ మార్కెట్ పదవిని ఎస్సీ, ఎస్టీ, ఓసీలకు మాత్రమే అవకాశం ఇస్తూ.. బీసీలను విస్మరిస్తున్నారన్నారు. జనరల్ స్థానంలో కూడా బీసీ సామాజిక వర్గానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే స్పందించాలని కోరారు. సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్, నాయకులు మురళియాదవ్, అజయ్, నర్సింహ, అజయ్, గంగాధర్, హరితేజ, కృష్ణ తదితరులున్నారు.

నేడు వేములపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

వేములపల్లి : మండల కేంద్రంలోని పీఏసీఎస్ చైర్మన్‌పై గురువారం అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించనున్నారు. చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని గత నెల 29న తొమ్మిది మంది డైరెక్టర్లు జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. దానిపై గురువారం ఉదయం 11గంటలకు స్థానిక పీఏసీఎస్ కేంద్రంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి అవిశ్వాస తీర్మానం నిర్వహించనున్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం

మిర్యాలగూడ, మిర్యాలగూడ టౌన్, వేములపల్లి : మిర్యాలగూడ పట్టణంలోని గాంధీపార్క్ పాఠశాల, అశోక్‌నగర్‌లోని విశ్వభారతి పాఠశాల, వేములపల్లి మండలంలోని మొల్కపట్నం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



మిర్యాలగూడ: విశ్వభారతి పాఠశాలలో ప్రజాప్రతినిధులు, అధికారుల వేషధారణలో విద్యార్థులు



మిర్యాలగూడటౌన్: గాంధీపార్క్ పాఠశాలలో ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు



వేములపల్లి: మొల్కపట్నం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు